

మండుతున్న సూరీడు

విలవిల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు



బోసిపోయిన చిత్తూరు పాత కలెక్టరేట్ సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూరీడు కొద్దిరోజులుగా భగ్గుమంటున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తన భగభగలతో ప్రజలను అల్లాడిస్తున్నాడు. వృద్ధులు, చిన్నారులైతే విలవిల్లాడుతున్నారు. శనివారం శ్రీరంగరాజపురంలో అత్యధికంగా 39.9, రామకుప్పంలో అత్యల్పంగా 32.4 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా.. నగరిలో 38.7, చిత్తూరు, గంగాధరనెల్లూరులో 38.3, గుడిపాలలో 38.1, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పంలో 38, తవణంపల్లెలో 37.8, బంగారుపాళ్యంలో 37.5, సోమలలో 37.3, సదుంలో 36.8, చౌడేపల్లె, ఐరాల, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం, యాదమరి, నింద్రలో 36.4, గంగవరం, పెద్దపంజాణిలో 36.3, శాంతిపురం, గుడుపల్లెలో 36, కార్వేటినగరంలో 35.9, రొంపిచెర్లలో 35.6, పలమనేరులో 34.5, వి.కోటలో 34.3, కుప్పంలో 33.9, పుంగనూరులో 33.5, బైరెడ్డిపల్లెలో 33.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

12మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోలుగా 12 మందికి పదోన్నతి కల్పిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఎనిమిది మంది డిప్యూటీ ఎంపీడీవోలు, నలుగురు ఏవోలున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందినవారు పది మంది ఉన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోల వివరాలిలా..: జీడీనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న హరిప్రసాద్‌రెడ్డిని, రామకుప్పంలోని రాధాకృష్ణను, కడప జిల్లాలోని హరిప్రసాద్‌రెడ్డిని, వెదురుకుప్పంలోని పురుషోత్తంను, పులిచెర్లలోని రాజశేఖర్‌బాబు, అనకాపల్లెలోని శిరీషను చిత్తూరు జిల్లా కేటాయించారు. ఎర్రావారిపాళెంలో పనిచేస్తున్న మాలతిని, నాగలాపురంలోని వెంకటరమణను తిరుపతి జిల్లాకు కేటాయించారు.

ఏవోల వివరాలు.. : నగరి ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సతీష్‌ను, గంగవరంలోని భాస్కర్‌ను, బైరెడ్డిపల్లెలోని మహేష్‌ను చిత్తూరు జిల్లాకు కేటాయించారు. రామసముద్రంలోని గౌస్‌బాషాను కడప జిల్లాకు కేటాయించారు.

30న డీఆర్సీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో నిర్వహించడానికి యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రవాణశాఖ మంత్రి రాంప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లాకు చెందిన పార్లమెంటు, శాసనమండలి, శాసనసభ్యులతోపాటు కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రత్యేక ఆహ్వానితులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు.



మామిడి కాయలకు కవర్లు కట్టిన చెట్టు



కాయలకు కవర్లు కడుతున్న రైతు

కవచంలా కవర్లు..!

మామిడిలో నాణ్యత పెంపుతో పాటు అధిక దిగుబడి, మంచి ధర

మామిడి కాయలకు కవచంగా కవర్లు మారాయి. వీటి వల్ల వాతావరణంలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా.. దిగుబడి పెరుగుతోంది. కాయ కూడా నాణ్యంగా ఉండటంతో ధర కూడా ఆశించిన స్థాయిలో పలుకుతోందని రైతులు చెబుతున్నారు.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

జిల్లాలో లక్షా 60వేల ఎకరాల విస్తీర్ణంలో 95వేల మంది రైతులు మామిడి సాగు చేస్తున్నారు. ఏటా ఏదో ఒక రకమైన వాతావరణ ప్రతికూల పరిస్థితులతోపాటు తెగుళ్ల కారణంగా మామిడి పంట చేతికి రాకుండా పోతుంది. గత ఏడాది దిగుబడి గణనీయంగా తగ్గినా, టేబుల్ వెరైటీలు ధర పలకడంతో రైతులు లాభాలు చూశారు. సాధారణ రకాలు సాగుచేసిన రైతులకు నిరాశే మిగిలింది. ఇక మామిడి కాయలకు కవర్లు కట్టిన రైతులు మాత్రం ఏ రకానికైనా గిట్టుబాటు ధర పొందగలిగారు. దీంతో ఈ ఏడాది కూడా కాయలకు కవర్లు కట్టి పంటను కాపాడుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

కవర్లతో ప్రయోజనమిలా..

కవర్లు కట్టడం ద్వారా మామిడికి సోకే బూడిద, గింజపురుగు, ఆకుమచ్చ, పండుమచ్చ తెగుళ్లతోపాటు ఈగ, పురుగు పట్టడం తదితరాల బారిన పడకుండా కాయలను కాపాడుకోవచ్చు. అలాగే ఈదురు గాలుల కారణంగా కాయ దెబ్బతినడం, రాలిపోవడం వంటి వాటినీ నియంత్రించవచ్చు. దీని వల్ల కాయ బాగా వృద్ధి చెందడం, దెబ్బతినకుండా రంగు పట్టడం వంటి ప్రయోజనాలతోపాటు దిగుబడి సైతం అధికంగా వచ్చే వీలుంది. జిల్లాలో ఏటా 3.5 లక్షల టన్నుల నుంచి 4.5 లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది 5 లక్షల నుంచి 6.50 లక్షల టన్నులు దిగుబడి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

సగం ధరకే కవర్లు

ఒక్కో కవరు ధర రెండు రూపాయలు కాగా 50శాతం సబ్సిడీపై రూపాయికే రైతుకు ప్రభుత్వం అందజేసింది. ఇప్పటివరకు జిల్లాలోని 3,500 రైతులు 1.90 కోట్ల కవర్లు కొనుగోలు చేశారు.

కవర్లతో మంచి ధర



సాధారణంగా ఎకరాకు 5 టన్నుల దిగుబడి వస్తుండగా, కవర్లు కడితే ఏడు టన్నులు వస్తోంది. కాయ నాణ్యంగా ఉండడంతో మంచి ధర పలుకుతోంది. గత ఏడాది బేనీషా రకానికి కవర్లు కట్టకుంటే టన్ను ధర రూ.50వేలే వచ్చింది. అదే కవర్లు కట్టినవైతే రూ.80వేలు పలికింది. నీలం రకం కూడా కవర్లు కట్టకుంటే టన్ను రూ.50 వేలు రాగా, కవర్లు కడితే రూ.90 వేలు వచ్చింది.

- డి.కుమారస్వామి నాయుడు, కొండ్రాజుకాల్వ, తవణంపల్లె మండలం

పెరుగుతున్న దిగుబడి



కవర్లు కట్టడం వల్ల వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లోనూ కాయలను కాపాడుకోవచ్చు. పైగా దిగుబడి కూడా పెరుగుతోంది. కవర్లు కట్టిన మామిడి కొనుగోలుకు బయట వ్యక్తులు నేరుగా పొలాల వద్దకొస్తున్నారు.

- జ్యోతీశ్వర్‌రెడ్డి, పుత్రమద్ది, ఐరాల మండలం

డ్రోన్ల కొనుగోలుకు రైతు సంఘాలకు

సబ్సిడీతో రుణాలు

డీసీసీబీ బోర్డు మీటింగ్‌లో ఏకగ్రీవ తీర్మానం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ల కొనుగోలుకు రైతు సంఘాలకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఏకగ్రీవ తీర్మానం చేసింది. శనివారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జేసీ, బ్యాంకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి విద్యాధరి అధ్యక్షతన డీసీసీబీ బోర్డు మీటింగ్ జరిగింది. రైతు సంఘాలకు ఒక్కో డ్రోన్ కొనుగోలుకు 80శాతం సబ్సిడీతో కూడిన యూనిట్ ధర రూ.9.10 లక్షల రుణం రూపంలో నిధులు విడుదల చేయాలని బ్యాంకు అధికారులను జేసీ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనతో పీఎం సూర్యఘర్ కింద గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఇళ్లకు సోలార్ ప్యానళ్ల అమర్చడానికి రూ.3లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు బోర్డు తీర్మానించిందని ఆమె చెప్పారు. అలాగే ఈ ఏడాది బంగారం కుదువపై బ్యాంకు శాఖలు ఇంతవరకు రూ.210 కోట్లు ఇవ్వగా, ఇకపై సింగిల్‌విండోల ద్వారా కూడా ఒక్కొక్క సొసైటీకి రూ.కోటి మేర రుణాలివ్వాలని నిర్ణయించారన్నారు. బ్యాంకు బ్రాంచ్‌ల వలే గుర్తించిన సింగిల్‌విండోల ద్వారా కూడా అర్హతను బట్టి భూతనఖాపై రూ.3లక్షల వరకు స్వల్పకాలికేతర రుణాలు ఇవ్వాలని బోర్డు సిఫార్సు చేసిందన్నారు. బ్యాంకు కార్యకలాపాలను సీఈవో శంకర్‌బాబు వివరించారు. ఆప్కాబ్ డీజీఎం షఫీ, నాబార్డు డీడీఎం సునీల్, బ్యాంకు జీఎంలు మనోహర్ గౌడ్, లిల్లీ కేథరిన్, డీజీఎం చలపతి, ఏజీఎం సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వసతులున్నా అత్తెసరు ఫలితాలే

- **వసతిగృహాల్లో కరువైన పర్యవేక్షణ**
- **290మందిలో పాసైంది 140మందే**

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యపై ఖర్చు పెట్టే ప్రతిపైసాకూ తక్షణమే ఫలితం ఆశించకూడదు. ఆ ఖర్చు రాబోయే తరానికి మంచి ఫలితాన్ని అందిస్తుంది.... సీఎం చంద్రబాబు సంక్షేమ వసతిగృహాల సమీక్షాసమావేశాలు నిర్వహించిన ప్రతి సందర్భంలోనూ అధికారులకు చెప్పే మాట ఇది. ఇందుకోసమే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ వసతి గృహాలకు డైట్ ఛార్జీలను పెండింగ్ లేకుండా విడుదల చేస్తున్నారు. వారికి అవసరమనుకున్న ప్రతి పనీ చేసి పెడుతున్నారు. అయితే విద్యార్థులపై కిందిస్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్షా ఫలితాల్లో అత్తెసరు ఫలితాలే వచ్చాయి.

జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 57 వసతిగృహాలున్నాయి.వీటిలో 16 కళాశాల వసతి గృహాలు పోనూ మిగిలిన 41 వసతిగృహాల్లో టెన్త్ విద్యార్థులు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 290 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 140 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఫెయిలైన విద్యార్థుల్లో ఒకటి రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైన వారు చాలామంది ఉన్నప్పటికీ.. నాలుగైదు సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులూ ఉన్నారు.

● సిలబస్‌పై పట్టేదీ?

సాధారణంగా వసతిగృహాల వార్డెన్లు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ అర్హత కలిగివుండాలని ఉద్యోగ నియామకాల సమయంలోనే ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది. బీఈడీ లేకపోయినా డిగ్రీ అర్హతతో గ్రూపు పరీక్షలు రాసి ఉద్యోగాలు పొందుతున్నారు. అంతేకాకుండా వసతిగృహాల్లో పనిచేసే అటెండర్, ఇతర కేటగిరీల్లో పనిచేసే వారు ఓపెన్ యూనివర్శిటీల్లో డిగ్రీలు సంపాదించి వార్డెన్లుగా ప్రమోషన్లు పొందుతున్నారు.డిగ్రీలు చేసిన వారికంటే ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీల ద్వారా వార్డెన్లుగా ప్రమోషన్లు తీసుకున్న వారే అధికంగా ఉన్నారు. వీరి జాబ్ చార్ట్ ప్రకారం ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు స్టడీ అవర్ తీసుకోవాల్సి ఉంది.విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పాఠశాలల్లో జరిగే సిలబస్‌కు ముందే వసతిగృహ విద్యార్థులకు ఆ సిలబస్‌పై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు వార్డెన్‌కు ఆ సిలబస్‌పై పట్టు ఉండాలి. ప్రమోషన్ల కోసం డిగ్రీలు తీసుకునివచ్చిన వారికి టెన్త్ సిలబస్‌పై అవగాహన కాదు కదా... కనీసం వాటిని చదవటం కూడా రాదని తోటి వార్డెన్లు చెప్పడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అలాంటప్పుడు విద్యార్థులకు ఎక్కడ చదువు చెప్తారనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.



● 15 వసతిగృహాలు ఇన్‌ఛార్జులతోనే

జిల్లాలో 57 వసతిగృహాలుండగా... 15 ఇన్‌ఛార్జి వార్డెన్లతోనే నడుస్తున్నాయి.అనారోగ్య కారణాలతో వార్డెన్లు దీర్ఘకాలిక సెలవు తీసుకుంటుండడంతో ఇన్‌ఛార్జీ వార్డెన్ల ద్వారానే వసతిగృహాలు నడుస్తున్నాయి. ఎక్కడైతే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందో అక్కడ ఇన్‌ఛార్జి కావాలని చాలామంది వార్డెన్లు ఉన్నతాధికారిపై ఒత్తిడి చేసి వేయించుకుంటున్నారు. ముఖ్యంగా కాలేజీ హాస్టళ్లలో వేయించుకుంటే మరింత ఎక్కువమంది విద్యార్థులు ఉంటారని, అక్కడైతే నాలుగు రూపాయలు వెనకేసుకోవచ్చనే ఆశతో పైరవీలు చేసుకుంటున్నారు.కొన్ని వసతిగృహాలకు మూడు మండలాలకు అవతల ఉన్న వార్డెన్‌ను ఇన్‌చార్జిగా వేశారు. దాంతో ఆ వార్డెన్ అక్కడా పనిచేయరు... ఇక్కడా సక్రమంగా పనిచేయరు. ఈ విధంగా 15 మంది వార్డెన్లు ఎక్కడా సరిగ్గా పనిచేయడం లేదు.డైట్‌ఛార్జీలు, ఇతర బిల్లుల్లో ఎంత మిగులుతుందో అన్నదానిపై ఉన్న ధ్యాస విద్యార్థుల బాగోగులపై చాలామంది వార్డెన్లకు లేకపోవడంతోనే టెన్త్‌లో అత్తెసరు ఫలితాలు వచ్చాయని ఉన్నతాధికారులు అంచనాకొచ్చారు.

●వెళ్లామా...వచ్చామా!

సాధారణంగా ఒక పాఠశాలలో ఏ సబ్జెక్టులో అయితే అత్యధికంగా విద్యార్థులు ఫెయిలవుతారో... ఆ సబ్జెక్టుకు సంబంధించిన టీచర్‌పై జిల్లా విద్యాశాఖ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. అయితే సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మాత్రం వార్డెన్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దాంతో వార్డెన్లు చాలా మంది వసతి గృహాల్లో విద్యార్థులకు రెండుపూటలా భోజనాలు పెట్టామా... ప్రభుత్వం ఇచ్చే నోటుపుస్తకాలు, దుస్తులు, పెట్టెలు, ఇతర సామగ్రిని ఇవ్వడంతో తమ పని అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు. వార్డెన్ పని చేసే ప్రాంతంలోనే నివాసముండాలన్న నిబంధన ఉన్నప్పటికీ ఎక్కువమంది వార్డెన్లు ఉండడం లేదు. చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు చెందిన వార్డెన్లు చిత్తూరులో నివాసముంటున్నారు. కుప్పం నియోజకవర్గంలోని అన్ని మండలాల వార్డెన్లు కుప్పంలో, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల వార్డెన్లు ఆయా కేంద్రాల్లో ఉంటున్నారు. ఒక వార్డెన్ ఉదయం వసతిగృహానికి వెళ్లి ఉదయం, సాయంత్రానికి సంబంధించిన ప్రొవిజన్స్‌ను ఇచ్చి వచ్చేస్తున్నారు. ఆ తరువాత మరుసటి రోజు ఉదయమే వసతిగృహానికి వెళుతున్నారు.

టెన్త్ విద్యార్థులపై ఖర్చు రూ. కోటి

ఒక్కో టెన్త్ విద్యార్థికి నెలకు రూ. 1400 డైట్‌ఛార్జీని ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఈ లెక్కన సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న 280 మంది విద్యార్థులకు నెలకు రూ. 4 లక్షలు. ఈ లెక్కన ఏడాదికి రూ. 48 లక్షల వరకు చెల్లిస్తున్నారు. దాంతో పాటు ప్రతి విద్యార్థికీ టెన్త్ స్టడీ మెటీరియల్, నోటు పుస్తకాలు, ట్యూటర్లు, ప్యాడ్లు, దుస్తులు, బెడ్ షీట్లతో కలిపి మరో రూ. 50 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఈ లెక్కన టెన్త్ విద్యార్థులపై ప్రభుత్వం రూ. కోటి వరకు ఖర్చు చేస్తే.. సగం మంది పాసవ్వడం ... అదికూడా అత్తెసరు మార్కులు రావడం వార్డెన్లు, ఆ శాఖ ఉన్నతాధికారుల పనితీరుకు అద్దంపడుతోంది.

చెంగనపల్లె వద్ద చిరుత కలకలం!



మామిడి తోపులో చిరుత పాదముద్రలు

ఐరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని చెంగనపల్లెలో ఓ చిరుత కలకలం రేపుతోంది. చెంగనపల్లెలో ఉన్న మట్టపల్లెకు చెందిన మల్లీశ్వరరెడ్డి మామిడి తోపులో శనివారం చిరుత పాదముద్రలు కనిపించాయి. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళితే వారు పాదముద్రలు సరిగా కనిపించడం లేదని చెప్పినట్లు మల్లీశ్వరరెడ్డి తెలిపారు. గ్రామానికి సమీపంలోని పెద్దకొండలో నాలుగు చిరుతలున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. చిరుతలు, ఇతర అడవి జంతువులు తరచూ పెద్దకొండ నుంచి రోడ్డుకు అవతల ఉన్న దుర్గంకొండ దిగువ భాగంలో ఉన్న సీతానుమూల వద్ద చెలిమిలో నీళ్ల తాగడానికి వస్తుంటాయన్నారు. గతంలో చిరుత దాడిచేసి ఓ పాడి ఆవును చంపి తిన్నట్లు చెప్పారు. తరచూ గొర్రెలు మేపేవారికి చిరుతలు కనిపించినట్లు సమాచారం. అటవీ శాఖ అధికారులు పెద్దకొండ, దుర్గం కొండ ప్రాంతాల్లో బోను ఏర్పాటు చేసి చిరుతను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

14సంవత్సరాల్లో 42మంది బలి

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత 14 ఏండ్లలో 42మంది గజదాడులకు బలైపోయారు.వీరిలో కొద్ది మంది మినహా ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలను రక్షించుకునే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకున్న రైతులే వున్నారు. గజదాడులకు బలైన రైతుల్లో వెంకటేశులు,గంగులప్ప, సోనియా,వెంకటప్ప,ఉష,శివలింగం(కుప్పం మండలం), తిమ్మప్ప నాయుడు(గుడుపల్లె),కన్నానాయక్, రెడ్యా నాయక్, చిన్నబ్బ(రామకుప్పం),రామిరెడ్డి,ఆరేటయ్య, గంగులయ్య, వెంకట్రమణ (ఎర్రావారిపాలెం),వెంకట్రామయ్య (రామ సముద్రం), తుపాకుల చిన్నబ్బ(పుత్తూరు),మార్కొండేయ, బంగారప్ప(పెద్దపంజాణి),చిన్నబ్బ(బంగారుపాళ్యం),ఎల్లప్ప (సదుం), వెంకటేశు,సెల్వికార్తీక్,వసంత(గుడిపాల), మస్తాన్ (పులిచెర్ల), కణ్ణన్, రాకేష్ నాయుడు(చంద్రగిరి), చిన్న రాజారెడ్డి(పీలేరు), రొడ్డా సిద్ధయ్య(చిన్నగొట్టిగల్లు మండలం)తో పాటు యాదమరి మండలం దళవాయి పల్లెకు చెందిన ఇద్దరు,పలమనేరు మండలానికి చెందిన నలుగురు వున్నారు.ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్లు మరో నలుగురు కూడా గజదాడులకు బలైపోయారు.శివరాత్రి ఉత్సవాలకు తలకోన వస్తుండగా రైల్వేకోడూరుకు చెందిన ముగ్గురిని కూడా ఏనుగులు తొక్కి చంపేశాయి.

దారి మారినా వెంటాడిన మృత్యువు

● గజదాడికి బలైన సిద్ధయ్యకు రూ.10 లక్షల పరిహారం



ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏనుగు బారిన పడకుండా మరోమార్గంలో వెళ్లినా మృతువు ఆ రైతును వెంటాడింది. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ దాసరిగూడేనికి చెందిన రొడ్డా సిద్ధయ్య శుక్రవారం రాత్రి ఏనుగు దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆరు నెలలుగా భాకరాపేట, ఎగవూరు, చిట్టిచెర్ల పంచాయతీల్లో ఒంటరి ఏనుగు సంచరిస్తోందని రైతులు గుర్తించారు.అయితే మూడు రోజులుగా బోడేవాండ్లపల్లె- డక్కావాండ్లపల్లె మధ్య పొంతలకుంట మామిడి తోటల్లో రెండు ఏనుగులు తిష్ట వేశాయి. ఈ విషయం ఈ ప్రాంత రైతులకు తెలియలేదు. శుక్రవారం రాత్రి ఇందులో ఒక ఏనుగు చిట్టేచెర్ల క్రాస్, కుమ్మరపల్లె, మఠం గొల్లపల్లె ప్రాంతాల్లో సంచరించి రాత్రి జంగమాలకొండ వద్ద ఎరప చెరువుకు చేరుకుంది. మరో ఏనుగు పొంతలకుంట నుంచి కొత్తపల్లె దేవరకొండ రోడ్డు మీదుగా ఎరప చెరువు వద్ద ఉన్న సహచర ఏనుగు వద్దకు వెళుతోంది. సిద్ధయ్య కూరగాయలు కోసుకొని ఏనుగు బారిన పడకూడదని దేవరకొండ రోడ్డు మార్గాన బయలుదేరి కొత్తపల్లె సమీపాన రెండో ఏనుగుకు దొరికిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఎప్పటిలా ఏనుగులను తరిమేందుకు అర్ధరాత్రి వచ్చిన భాకరాపేట ఫారెస్టు అధికారులు విగతజీవిగా పడివున్న సిద్ధయ్యను గుర్తించారు.సిద్ధయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు పరిహారం ప్రకటించారు.



వీఐపీ కాటేజీలో నాగుపాము

తిరుమలలో వీఐపీలు బస చేసే స్పెషల్ టైప్ విశ్రాంతి భవనంలోని 14వ నెంబరు కాటేజీలోకి శనివారం ఐదున్నర అడుగుల నాగుపాము ప్రవేశించింది. భక్తులు భయంతో బయటకు వచ్చి భద్రతా సిబ్బందికి తెలియజేశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు అక్కడికి చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




శ్రీవారి పుష్కరిణిలో వేసవి సందడి

తిరుమల శ్రీవారి పుష్కరిణి భక్తులతో కిటకిటలాడుతోంది. సాధారణంగా తిరుమలకు చేరుకునే భక్తులు ముందుగా పుష్కరిణిలో స్నానమాచరించి, వరాహస్వామిని దర్శించుకున్న తర్వాత శ్రీవారిని దర్శించుకుంటారు. వేసవి కూడా తోడవడంతో ప్రస్తుతం పుష్కరిణి సందడిగా మారింది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు పుష్కరిణిలో కనిపిస్తున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని కంపార్టుమెంట్లన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్ల వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.37 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,536

తలనీలాలు సమర్పించినవారు: 30,612

కావు ఇవి చేటు..వెయ్యొద్దు వేటు

కోనోకార్పస్ చెట్లపై భిన్నవాదనలు

ఇవి పర్యావరణ హితమేనంటున్న జనవిజ్ఞాన వేదిక

నేడు ప్రెస్‌క్లబ్‌లో నిపుణులతో సమావేశం



తిరుపతి-ఆంధ్రజ్యోతి

'కోనోకార్పస్ చెట్లపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. పశువులు తినవు. పిట్టలు వాలవు. పైగా ఆరోగ్యానికి కీడు కలిగిస్తాయి. జల వనరులను పీల్చేస్తాయి. పర్యావరణంతో పాటు మనుషులకూ హాని కలిగిస్తుందంటూ కొందరు చెబుతున్నారు. వీటితో ఏకీభవిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఇటీవల కాకినాడలో వ్యాఖ్యానించారు. ఈ విదేశీ వృక్షాలను తొలగించాలని ఆయన ఆదేశించారు. ఈ చెట్లపై చేస్తున్న ప్రచారాలన్నీ అపోహలేనని, శాస్త్రీయంగా ఏదీ రుజువు కాలేదని కొన్ని వర్గాలంటున్నాయి. ఇప్పటికే చాలాచోట్ల ఈ చెట్లను తొలగించే ప్రయత్నం చేశారు. వృక్షశాస్త్ర నిపుణులే విరుద్ధమైన వాదనలు లేవనెత్తుతున్నారు. శాస్త్రీయమైన పరిశోధన లేకుండానే కోనోకార్పస్ చెట్లు తొలగించకూడదని హైకోర్టులో ప్రజాప్రయోజనాల వాజ్యం కూడా దాఖలైంది. ఈ నేపథ్యంలో ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొందరు నిపుణులు సశాస్త్రీయమైన ఆధారాలతో ఈ మొక్క విశిష్టత గురించి వివరించనున్నారు.

● **నగరంలో పలుచోట్ల ఆకర్షణగా...**

తుడా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో కూడా విరివిగా కోనోకార్పస్ చెట్లను నాటారు. విమానాశ్రయం, తుమ్మలగుంటమార్గం, రామానుజ సర్కిల్ నుంచి రిలయన్స్ మార్టు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఈ చెట్లు కనిపిస్తాయి. పుప్పిడి దశకు రాకుండానే వీటిని శంఖు ఆకృతిలో కట్ చేస్తుంటారు. అందం, ఆకర్షణ, చిక్కటి పచ్చదనంతో కనిపిస్తుంటాయి. గార్డెనింగ్‌కు అనువుగా ఉంటుందని కొందరు ఇళ్ల వద్దా పెంచుకుంటున్నారు.

● **యూకలిప్టస్ కన్నా కోనోకార్పస్ సేఫ్**

కోనోకార్పస్ చెట్ల వేర్లు విస్తరించి పైపులైన్లు, గోడలను దెబ్బతీస్తాయని, విషవాయువులను విడుదల చేస్తాయనేవి అపోహలే. ఏ చెట్ల వేర్లయినా విస్తరిస్తే ఇలాంటి ఫలితాలే ఉంటాయి. కోనోకార్పస్ చెట్లు వాయు కాలుష్యాన్ని తగ్గిస్తాయి.వీటి ద్వారా వచ్చే నూనె యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.మధుమేహాన్ని, వివిధ రకాల ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది.ఎక్కువగా కార్బన్‌డైఆక్సైడ్ పీల్చుకుని ఆక్సిజన్ మరింత ఎక్కువగా విడుదల చేస్తుంది.ఈ వృక్షాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నట్టు పరిశోధన పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. కడప జిల్లాలో కొన్ని వందల ఎకరాలలో వీటిని పెంచుతున్నారు.

- మాధవశెట్టి, ప్రముఖ వృక్షశాస్త్ర నిపుణులు



ఏడుగురు సీఐల బదిలీ

● నలుగురు వీఆర్‌కు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ శనివారం రాత్రి అనంతపురం డీఐజీ షిమోషీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నలుగురిని వీఆర్‌కు బదిలీ చేశారు.రేణిగుంట రూరల్ సీఐ ఈ.మురళీకృష్ణ, శ్రీకాళహస్తి టూ టౌన్ సీఐ వెంకటేశ్వర్లను వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న నాగార్జున రెడ్డిని శ్రీకాళహస్తి టూ టౌన్‌కు, ఏర్పేడు సీఐ జయచంద్రను రేణిగుంటకు, అక్కడ పనిచేస్తున్న శరత్‌చంద్రను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న శ్రీకాంత్ రెడ్డిని ఏర్పేడుకు, డీఐజీ వీఆర్‌లో ఉన్న మంజునాథ రెడ్డిని తిరుపతి ఎస్పీ వీఆర్‌కు బదిలీ చేశారు. వీరందరూ తక్షణం రిలీవ్ అయి వారికి కేటాయించిన స్థానాల్లో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సంక్షేమ వసతిగృహ టాపర్లకు అభినందనలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం అభినందించారు. పదిలో 586 వరకు మార్కులు సాధించిన విశ్వనాథ్, హనుమంత్, భావన, భగీరథ్, నీలకుమార్, భానుశ్రీ, గుణశేఖర్, దీపేష్, ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన హైమావతి, నీలావతి, లక్ష్మీప్రసన్న, యువశ్రీ, రాజు, సంజయ్‌ను కలెక్టర్ అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలతో పాటు అబ్దుల్‌కలాం ఆత్మకథ పుస్తకాలను అందజేశారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలకి విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్

దివ్యారామంలో చెట్ల నరికివేతపై విచారణాధికారి నియామకం

అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని దివ్యారామం ఎకో పార్క్‌లో నిబంధనలకు విరుద్ధంగా చెట్ల నరికివేతపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా పీసీసీఎఫ్(ప్రొడక్షన్) పీవీ చలపతిరావును నియమిస్తూ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దివ్యారామంలో చెట్ల నరికివేత కార్యకలాపాల్లో పాల్గొన్న అధికారుల పాత్రను నిర్ధారించడం, ఈ ఉదంతంపై విచారణ నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 30లోగా ప్రభుత్వానికి వివరణాత్మక నివేదిక సమర్పించాలని విచారణాధికారిని ఆదేశించారు. కాగా దివ్యారామంలో చెట్ల నరికివేతపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సీరియస్ అవడంతో అటవీశాఖ విచారణకు ఆదేశించింది.

'మనోళ్ల దగ్గర ఉండుంటాడులే' అనుకుని..

● దర్శనానికి వెళ్లిపోయిన తల్లిదండ్రులు

● గుర్తించి అప్పగించిన తిరుమల పోలీసులు

తిరుమల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాత్రి తప్పిపోయిన ఆరేళ్ల పిల్లాడిని తిరుమల పోలీసులు ఉదయానికల్లా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కర్ణాటకలోని కాడెనందిహల్లికి చెందిన శేఖరప్ప, రేణుక దంపతులు ముగ్గురు పిల్లలు, మరికొంతమంది కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చారు. రాత్రి 8 గంటల సమయంలో తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 2 వద్ద టీ తాగారు. ఆ సమయంలో శేఖరప్ప ఆరేళ్ల చిన్న కుమారుడు మాన్విత్ కనిపించలేదు. తమ బంధువులతో కలిసి దర్శనానికి వెళ్లి ఉంటాడని భావించిన తల్లిదండ్రులు దర్శనానికి వెళ్లారు. వెనక్కి వచ్చి చూస్తే పిల్లాడు కనిపించలేదు. గాలించినా దొరక్కపోవడంతో టీటీడీ బ్రాడ్ కాస్టింగ్ ద్వారా శనివారం ఉదయం ప్రచారం చేయించారు. యాత్రికుల సముదాయంలోని 4వ నెంబరు హాల్‌లో ఆరేళ్ల మాన్విత్‌ను గుర్తించిన పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.



మాన్విత్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అలిగివచ్చిన మహిళ అప్పగింత

ఇంటి నుంచి అలిగి తిరుమలకు వచ్చిన ఓ మహిళను తిరుమల పోలీసులు తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విశాఖపట్నంకు చెందిన రమ్యరాజు(40) ఇంట్లో గొడవలతో మనస్థాపం చెంది 24వ తేదీన ఇంటి నుంచి తిరుమలకు చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆందోళన పడుతుండగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వారికి ఫోన్ చేసి, తిరుమలలో ఉన్నట్టు చెప్పింది. కుటుంబ సభ్యులు వెంటనే తిరుమల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫోన్ నెంబరు ఆధారంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద ఆ మహిళను గురించి అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం తిరుమలకు చేరుకున్న కుటుంబ సభ్యులకు రమ్యరాజును పోలీసులు అప్పగించారు.

సిద్ధయ్య కుటుంబానికి పరిహారం



సిద్ధయ్య అంత్యక్రియలు



సిద్ధయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో అశువులు బాసిన సిద్ధయ్య(72) అంత్యక్రియలను శనివారం స్వగ్రామం దాసరిగూడెంలో నిర్వహించారు. సిద్ధయ్య కుటుంబానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలు పరిహారం ప్రకటించినట్లు చంద్రగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దేవర మనోహర్ తెలిపారు. శనివారం సిద్ధయ్య అంత్యక్రియల్లో పాల్గొని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఫోన్ ద్వారా సిద్ధయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిద్ధయ్య దహన సంస్కారాలకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని పార్టీ నాయకులతో పంపించారు. సర్పంచ్ నాగచెంగమనాయుడు, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, చాంద్‌బాషా, సహదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవులు, శని త్రయోదశి కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

● పలువురు కార్మికులకు గాయాలు





గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పరిశ్రమకు కార్మికులను తరలిస్తున్న ఓ బస్సు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పలువురు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. నాగలాపురం మండలం వేంబాక్కం పంచాయతీ హరిజనవాడ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు చెందిన బస్సు నాగలాపురం నుంచి కార్మికులను తీసుకెళ్తుండగా వేంబాక్కం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. బస్సులోని 35మంది ప్రయాణికుల్లో 22 మందికి స్వల్ప గాయాలు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సునీల్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తొమ్మిదిమందిని మెరుగైన వైద్యం కోసం నగరి ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం బాధితులను ఫోన్‌లో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వివిధ అంశాలపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. నీటి సమస్య ఉన్న ప్రదేశాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. అలాగే తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు భూ కేటాయింపుపై సమగ్ర విచారణ చేయండి

● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశం

తిరుపతి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి చెందిన భూములు శేషాచలం వైల్డ్‌లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తాయని మీడియాలో వచ్చిన కథనాలపై తక్షణం నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. షిరిడీ సాయి కంపెనీకి కేటాయించిన భూముల్లో అటవీ భూముల క్రమబద్ధీకరణ చట్టం 1980 నిబంధనలు పూర్తిగా గాలికి వదిలేశారని వచ్చిన మీడియా కథనాలను పవన్ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. భూ కేటాయింపులు, సంబంధిత వివరాలు నివేదిక రూపంలో అందజేయాలని, కేటాయింపుల ప్రక్రియపైనా వివరాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. తిరుపతిలోని శేషాచలం అడవులకు ఆనుకుని ఉన్న ఉపాధ్యాయనగర్ గ్రాండ్ వరల్డ్ రోడ్డులో అటవీ సరిహద్దు కంచె ధ్వంసం కావడంతో వన్యప్రాణులు దప్పిక కోసం, తిండి కోసం బయటకు వస్తూ ప్రాణాపాయ పరిస్థితిలోకి వెళ్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వివరాలు చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి అటవీ, బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ పరిధిలో ఉన్న ఫెన్సింగ్‌కు తగిన మరమ్మతులు చేయాలని అటవీ అధికారులను ఆదేశించారు.

శ్రీసిటీ సెజ్ దేశానికి ఉత్తమ నమూనా



మాజీ అధికారుల బృందంతో శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సెజ్ పాలసీ లక్ష్యాలకనుగుణంగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశానికి ఉత్తమ నమూనాగా కేంద్ర వాణిజ్య శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి జి.కె.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్‌ల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన పలువురు కేంద్ర ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారులు శ్రీసిటీని సందర్శించారు. దేశంలో సెజ్‌లు స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన ప్రత్యేకతను సంతరించుకుంది. జి.కె.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికాలరు. శ్రీసిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సాధించిన విజయాలు, ప్రగతిని వివరించారు. శ్రీసిటీ పరిసరాల సందర్శన అనంతరం వివిధ పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ మాట్లాడుతూ సెజ్ పాలసీ మార్గదర్శకులు శ్రీసిటీ పర్యటనకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీ ఏర్పాటు సమయంలో అందించిన ప్రోత్సాహం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. జి.కె.పిళ్లై మాట్లాడుతూ... బంజరు భూమి నుంచి అద్భుత పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ రూపాంతరం చెందడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. శ్రీసిటీలో పెట్టుబడులు - స్నేహపూర్వక వాతావరణ వ్యవస్థను సీబీఐసీ మాజీ సభ్యుడు యోగేంద్ర గార్గ్ కొనియాడారు. అనంతరం అధికారుల బృందం ట్రిపుల్ ఐటీకి వెళ్లి అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. పర్యటన బృందంలో గోవా మాజీ చీఫ్ సెక్రటరీ బి.విజయన్, ఐటీఎస్ మాజీ అధికారి ఎల్.బి.సింఘాల్, ఇండస్ట్రియల్ పార్క్, వేర్ హౌసింగ్ మండలి మాజీ కో-చైర్మన్ హితేంద్ర మెహతా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ముమ్మరంగా తనిఖీలు

జనసంద్ర ప్రాంతాలను జల్లెడ పట్టిన భద్రతా దళాలు



తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. తిరుపతి నగరంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, టీటీడీ వసతి గృహాలు, అలిపిరి చెక్ పాయింట్ల వద్ద శనివారం తనిఖీలు చేశారు. అనుమానమున్న ప్రతి ఒక్కరినీ విచారణ జరిపి, వివరాలు సేకరించారు. మరో వైపు బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలను తనిఖీ చేశాయి. పార్సిల్ కార్యాలయం వద్ద డాగ్ స్క్వాడ్లు తనిఖీ చేశాయి. సెంట్రల్ బస్టాండులోని చెన్నై ప్లాట్‌ఫారం వద్ద అనుమానంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరుపతికి వచ్చే ప్రయాణికులను భారతి బస్టాండు వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేశారు. లగేజీ కేంద్రాలు, కొరియర్ కార్యాలయాలు, లాజిస్టిక్స్ ఆఫీసుల్లో అణువణువూ పరిశీలించారు. దీంతోపాటు నగరంలో డ్రోన్ నిఘా పెంచారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత

కోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ఇసుకలో కూరుకుపోయి మృతి చెందిన ఘటన కోట మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.... తిన్నెలపూడి పంచాయతీలోని లక్ష్మమ్మకండ్రిగ అరుంధతివాడకు చెందిన పారిచర్ల సుబ్రహ్మణ్యం(40) శనివారం ఇద్దరు స్నేహితులతో కలిసి తాటితోపు వద్ద రంపపు కోత పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగించుకుని సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలోని వెళ్లారు. సుబ్రహ్మణ్యం చేపలు పట్టేందుకు నది మధ్యలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు ఇసుకలో కూరుకుపోయాడు. వెంటనే అతని స్నేహితులు ఇద్దరూ లక్ష్మక్క కండ్రిగలోకి వెళ్లి జరిగిన విషయం చెప్పడంతో గ్రామస్థులంతా వచ్చి ఇసుకలో కూరుకుపోయిన సుబ్రహ్మణ్యంను బయటకు లాగగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతిచెందిన సుబ్రహ్మణ్యం

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి(ఆటోనగర్)ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులు ఆదివారం తమ రెవెన్యూ కార్యాలయాల్లో చెల్లించవచ్చని ఆ డివిజన్ ఈఈ చంద్రశేఖర్ రావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సిబ్బంది పని చేస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న సీఎం చంద్రబాబు రాక

శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన

తిరుపతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8న ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి జిల్లాకు రానున్నారు. శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ప్రాథమికంగా సీఎం పర్యటన షెడ్యూలు ఖరారైందని కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం వెల్లడించారు. శ్రీసిటీలో భూములు కేటాయిస్తే రూ. 5001 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తయారు చేసే ప్లాంట్ నెలకొల్పుతామని ఎల్జీ సంస్థ గతేడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన సంగతి తెలిసిందే. ఈ ప్లాంట్ ద్వారా 1495 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ ప్రతిపాదించింది. దీంతో మూడు దశలకూ కలిపి శ్రీసిటీలో ఆ సంస్థకు 450 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం గతేడాది నవంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. దానితో పాటు అవసరమైన రాయితీలు, మినహాయింపులు సైతం ప్రకటించింది. తొలుత నిర్ణయించుకున్న షెడ్యూలు ప్రకారం ఎల్జీ సంస్థ ఈ ఏడాది జనవరిలోనే ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి వుంది. అయితే వివిధ కారణాలతో ఆలస్యం అయింది. ప్రస్తుతం ఏర్పాట్లన్నీ పూర్తి కావడంతో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని సంస్థ ప్రతినిధులు నిర్ణయించారు. ఆ మేరకు ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో వచ్చే నెల 8వ తేదీన సీఎం చంద్రబాబు పర్యటన ప్రాథమికంగా ఖరారైంది. దానికనుగుణంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

రిజిస్ట్రేషన్లు మరింత సులభతరం

30నుంచి జిల్లావ్యాప్తంగా స్లాట్ విధానం అమలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం స్లాట్ల విధానాన్ని అమల్లోకి తెచ్చింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇకపై స్లాట్ బుకింగ్ విధానాల్లోనే రిజిస్ట్రేషన్లు జరుగను న్నాయి. ఈనెల 4 నుంచి చిత్తూరు జిల్లాకేంద్రంలోని ఆర్వో కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అమలుచేసిన ఈ విధానం సత్ఫలితాలు ఇవ్వడంతో జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ (ఎస్‌ఆర్) కార్యాలయాల్లో అమలుకు శ్రీకారం చుడుతున్నారు. ఇకపై రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. భూములు, ఇళ్ళు, స్థలాలు కొనుగోలు చేసినవారు రిజిస్ట్రేషన్లకు వారి పరిధిలోని ఎస్‌ఆర్‌లకు చేరుకుని గంటల తరబడి వేచిచూసేవారు. ఇకపై ఆ ఇబ్బందులు తప్పనున్నాయి. నూతన స్లాట్ విధానాన్ని ఈనెల 30 నుండి చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, కార్వేటినగరం, నగరి ఎస్‌ఆర్ కార్యాలయాల్లో అమలు చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

● సమయం ఆదా...

మంగళ, శుక్రవారాలు మినహా అన్ని రోజుల్లో స్థిరాస్తి క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లకు అన్ని ఎస్‌ఆర్ కార్యాలయాల వద్ద రద్దీ ఉంటుంది. ఆ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే గంటల తరబడి జాప్యం తప్పడం లేదు.వచ్చినరోజు రిజిస్ట్రేషన్ పూర్తికాకపోతే సమయంతో పాటు రవాణా ఖర్చులు వృథా అయ్యేవి. స్లాట్ బుకింగ్ విధానంతో ఈ సమస్యలకు చెక్ పడనుంది.



● 39 స్లాట్లు చొప్పున

జిల్లాలోని అన్ని ఎస్‌ఆర్ కార్యాలయాల్లో రోజుకు 39 స్లాట్లు అందుబాటులో ఉంటాయి. చిత్తూరు ఆర్వో కేంద్రంలో మాత్రం 78 వరకు వినియోగించుకునే వెసులుబాటు ఉంది. నిర్దేశించిన సమయంలో స్లాట్ బుక్ చేసుకున్నవారు వచ్చినా, రాకున్నా మరొకరికి అవకాశం ఇవ్వరు. రోజుకు వారికిచ్చిన స్లాట్‌లో మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య వారికి నచ్చిన సమయంలో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు.

● నిరీక్షణకు తెర

ఎప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలో ముందుగానే నిర్ణయించుకుని, తగిన సమయాన్ని బుక్ చేసుకోవచ్చు. దీనికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. స్లాట్‌లో కేటాయించిన సమయానికి రాకుంటే 20 నిమిషాల తర్వాత ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. దీనిని రీషెడ్యూల్ చేసుకునేందుకు రూ.200 రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

కొనసాగుతున్న ఒంటరి ఏనుగు దాడులు





ధ్వంసమైన టమోటా పంట - ఒంటరి ఏనుగు జాడను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కల్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తూర్పు విభాగం అటవీప్రాంతంలోని చింతలవంక నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరిన ఒంటరి ఏనుగు మండలంలోని పాళెం వద్దకు చేరుకుంది. మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌కు చెందిన టమోటా పంటను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. టమోటా చెట్లకు అమర్చిన కొయ్యలను విరిచేసింది. అనంతరం అడవినుంచి వచ్చిన దారిలోనే తిరుగుముఖంపట్టింది. ధ్వంసమైన టమోటా పంటను శనివారం ఉదయం అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. శనివారం పగలంతా ఒంటరి ఏనుగు జాడను గుర్తించేందుకు తూర్పు విభాగం అటవీప్రాంతంలోని సూరప్పచెరువు, కోటరాళ్ల పరిసరాల్లో పర్యటించారు. ఏనుగు జాడ కనిపించకపోగా చీకటి పడటంతో ఆ ప్రాంతం నుంచి వెనుతిరిగినట్లు ఎఫ్‌బీవో కృష్ణమూర్తి తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



చిత్తూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడుల దృష్ట్యా జిల్లావ్యాప్తంగా పోలీసులు శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ మణికంఠ కూడా చిత్తూరు రెడ్డిగుంట జంక్షన్ వద్ద జరిగిన తనిఖీల్లో పాల్గొన్నారు. కాణిపాకం వినాయకస్వామి ఆలయంతోపాటు చిత్తూరు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, జనసమూహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్ల ద్వారా తనిఖీలు చేశారు. విదేశీయులు, వలస కార్మికుల సమాచారాన్ని సేకరించారు. హోటళ్లు, లాడ్జిల్లో బస చేసిన వారి వివరాలను తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 2,378 వాహనాలను తనిఖీలు చేసి 188 కేసులు పెట్టారు. రూ.74,196 జరిమానా వసూలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

డ్రోన్లతో నిఘా పెట్టండి: ఎస్పీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలపై డ్రోన్ల సాయంతో నిఘా పెట్టాలని ఎస్పీ మణికంఠ సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ.. ఇప్పటికే సిబ్బందికి డ్రోన్లపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పెండింగ్‌లోని కేసులపై సుదీర్ఘంగా సమీక్షించారు. కేసు నమోదు చేసిన వెంటనే నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ సాంకేతిక అవగాహనను కలిగి ఉండాలని, మొబైల్ ఫోన్లకు వచ్చే సంక్షిప్త సమాచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్‌కు డీజేఐ డ్రోన్‌ను అందించారు. సమావేశంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

30 ఆధార్ కిట్ల అందజేత



డిజిటల్ అసిస్టెంట్లకు ఆధార్ కిట్లు అందజేస్తున్న రవికుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు 30 ఆధార్ కిట్లను శనివారం తన కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి రవికుమార్ అందజేశారు. ఇప్పటికే 123 కిట్లు అందుబాటులో ఉండగా, మరో 30 కిట్లు అమరావతి నుంచి జిల్లాకేంద్రానికి అందాయి. ప్రతి కిట్‌లో రూ.2.50 లక్షలు విలువైన ప్రింటర్, ల్యాప్‌టాప్, ఐరిష్ కెమెరా, డివైజ్, ఫోకస్ లైట్, స్క్రీన్ పరికరాలున్నాయి. కొత్త ఆధార్ మంజూరు, సవరణలు, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలు సమీప సచివాలయాల ద్వారా పొందవచ్చని రవికుమార్ తెలిపారు.

సెక్టోరియల్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్షలో సెక్టోరియల్, సహాయ సెక్టోరియల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న అర్హులైన ఎస్‌ఏ, ఎస్జీటీ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్లానింగ్/ఎంఐఎస్ కోఆర్డినేటర్, సహిత విద్య కోఆర్డినేటర్, అసిస్టెంట్ సీఎంవో, ఏఎస్‌వో పోస్టులకు 55 ఏళ్లలోపు అర్హులైన టీచర్లు మే 5వ తేదీలోగా దరఖాస్తులను సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. కాగా ప్రత్యామ్నాయ అధికారిగా శశిధర్, సహాయ అకడమిక్ మానిటరింగ్ (తెలుగు) అధికారిగా సుభాషిణి శనివారం బాధ్యతలు చేపట్టారు. నోటిఫికేషన్ పోస్టుల్లోని అధికారులను శనివారం రిలీవ్ చేశారు.

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' ఇతివృత్తాల మార్పు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి సంబంధించి మే, జూన్ నెలల ఇతివృత్తాలను ప్రభుత్వం మార్పుచేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వేసవి నేపథ్యంలో మేనెల మూడో శనివారం 'ఉష్ణ తాపం నుంచి ఉపశమనం', జూన్‌లో 'నీరు - మీరు' అంశంపై ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. డిప్లొమా, ఐటీ, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న 19-35 ఏళ్లలోపువారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

మాజీ సైనికుల సంక్షేమ సంఘం



అమరులైన పర్యాటకులకు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న మాజీ సైనికులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. అమరులైన పర్యాటకులకు శనివారం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట కొవ్వొత్తులు వెలిగించి, నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ ఇలాంటి చర్యలతో భారతీయుల ఐక్యత, దేశ సమగ్రతను బలహీనపరచలేరని చెప్పారు. ముష్కరులకు భారత సైనికులు త్వరలోనే తగిన గుణపాఠం చెప్తారన్నారు. మాజీ సైనికుల సంక్షేమ అధికారి రాఘవులు, నాయకులు రామచంద్ర, సురేంద్రబాబు, పళని, గోవిందరాజన్, రఘుపతి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక - శిక్షణకు హాజరైన ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులు

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి (డీజే) అరుణ సారిక కోరారు. జిల్లా కోర్టు ఆవరణంలో శనివారం డీజే ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని న్యాయమూర్తులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆమె మాట్లాడుతూ కేసులను వెంటనే పరిష్కరిస్తే కక్షిదారులు ఇబ్బందులు పడరన్నారు. న్యాయమూర్తులు చట్టాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం కేసుల పరిష్కార విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. విశ్రాంత జిల్లా జడ్జిలు కె.పి.బాలాజి, ఎస్.జగన్నాథంతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

రేపు పలమనేరులో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్‌ను రద్దు చేశామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శికి డాక్టరేట్



తేజస్వి

నగరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీలోని గోల్డెన్ సిటీలో నివాసం ఉంటున్న పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం పంచాయతీ కార్యదర్శి తేజస్వి.. కుప్పంలోని ద్రావిడ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 'లోడ్ బ్యాలెన్సింగ్ ఇన్ క్లౌడ్ కంప్యూటరింగ్ యూజింగ్ హైబ్రిడ్ అప్రోచ్' అనే అంశంపై పరిశోధన చేసి, డాక్టరేట్ అందుకున్నారు. ఆయన్ను గ్రామస్తులు, సహోద్యోగులు అభినందించారు.

మనోవేదనతో నవ వధువు ఆత్మహత్య



సాబిత్రి మృతదేహం

శాంతిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఊరు కాని ఊరు...వచ్చీ రాని భాష...ఆపై ఒంటరితనం..ఆరోగ్య సమస్యలు...దీంతో ఏమి చేయాలో అర్థం కాక మనోవేదనతో ఓ నవవధువు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ నరేష్ కథనం ప్రకారం.... శాంతిపురం మండలం గుంజార్లపల్లె పంచాయతీ తుమ్మిశికొత్తూరుకు చెందిన సుబ్రమణ్యానికి రెండు నెలల క్రితం ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురం ప్రాంతానికి చెందిన సాబిత్రితో వివాహం జరిగింది.శాంతిపురం శివాలయం వీధిలోని ఓ అద్దె ఇంట్లో కాపురముంటున్నారు.సుబ్రమణ్యం కూలి పనుల కోసం బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకునేవాడు. సరిగా రాని భాషతో ఇబ్బందులు పడుతూ సాబిత్రి రోజంతా ఒంటరిగా గడిపేది. దీనికి తోడు ఆరోగ్య సమస్యలున్నాయి. వీటన్నింటిని వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా చెప్పినా సర్దుకుపోవాలన్నారు తప్ప.. బిడ్డ బాధను అర్థం చేసుకోలేదు.ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరుకున్న సుబ్రమణ్యం భార్య ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో తుమ్మిశికొత్తూరు వెళ్లిపోయాడు.శనివారం ఉదయం ఇంటికి వచ్చాడు. అప్పటికీ తలుపులు తీయక పోవడంతో పగలగొట్టి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న సాబిత్రి కన్పించింది. పోస్టుమార్టం నిమితం సాబిత్రి మృతదేహాన్ని కుప్పం వందపడకల ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాన్నా నన్ను క్షమించు!

లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి





యోగేష్ జేబులో చిక్కిన లెటర్, యోగేష్ మృతదేహం

గంగవరం,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాన్నా... ఐలవ్ యూ నాన్న....నిన్ను మిస్సవుతున్నా .....నన్ను క్షమించు నాన్నా అంటూ ఓ ఇంటర్ విద్యార్థి శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.పోలీసుల కథనం మేరకు...గంగవరం మండలం మదనపల్లె రోడ్డులో గల ఓ ప్రైవేటు కళాశాలలో శాంతిపురం మండలం గెసికపల్లెకు చెందిన యోగేష్ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో యోగేష్ ఫెయిలయ్యాడని తల్లిదండ్రులకు తెలిసి మందలించారు. సప్లిమెంటరీ పరీక్షలు దగ్గర పడుతుండడంతో, యోగేష్‌ను ఆమె తల్లి తీసుకొచ్చి మళ్లీ కాలేజి హాస్టల్‌లో చేర్పించి బాగా చదువుకొని ఈసారైనా పాసవు నాన్నా అని మంచి మాటలు చెప్పి వెళ్లిపోయింది. తరువాత ఏమి జరిగిందో ... హాస్టల్ గదిలోనే ఫ్యానుకు టవల్‌తో యోగేష్ ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటికి రూముకు వచ్చిన స్నేహితులు ఫ్యాన్‌కు వేలాడుతున్న యోగేష్‌ను కిందికి దింపి చూడగా, అప్పటికే మృతి చెందినట్లు తేలింది.యోగేష్ జేబులో ఓ లెటర్‌ను గుర్తించారు.తనను క్షమించమని తండ్రిని కోరాడందులో. ఈ లెటర్‌ను ఆయనకు చేర్చండి ప్లీజ్ అని రాసి వుంది.సీఐ ప్రసాద్‌ను విద్యార్థి ఆత్మహత్య విషయమై అడగ్గా తమకు సమాచారం అందినా, శనివారం రాత్రి 8.30 గంటల వరకు ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామన్నారు.

నీట్ సూపర్ స్పెషాలిటీలో.. గూడూరు డాక్టర్‌కు ఆలిండియా 132వ ర్యాంకు



కీర్తికుమార్

గూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కరణాల వీధికి చెందిన డాక్టర్ పర్వత కీర్తికుమార్ నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 132వ ర్యాంకు సాధించాడు. ఎండీ, ఎంఎస్ చేసిన వైద్యులు డీఎం, ఎంసీహెచ్ వంటి సూపర్ స్పెషాలిటీ కోర్సులను చేసేందుకు నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వెంకటరమణయ్య, కోటేశ్వరి దంపతుల కుమారుడైన డాక్టర్ కీర్తికుమార్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష రాయగా శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 132వ ర్యాంకు సాధించాడు. పలువురు వైద్యులు, కుటుంబ సభ్యులు ఆయన్ను అభినందించారు.

బాధితులకు అండగా టీడీపీ



ఆర్థిక సాయం పొందిన బాధితులతో ప్రేమ్ కుమార్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బాధితులకు అండగా నిలుస్తుందని ఆ పార్టీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కుప్పంలో ముఖ్యమంత్రి సహాయ నిధికోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి రూ.10 లక్షలు విలువ గల చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమమే కాకుండా బాధితులకు అవసరమైనప్పుడు సాయంగా నిలుస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, సర్పంచి రవి, నాయకులు చంద్ర, సంజీవి, రామచంద్ర, షఫి, శివ, నరసింహులు, జనార్ధన్, తిరుపతి, శ్రీనివాసులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మిట్టపల్లె, తిమ్మసముద్రం కాలనీలకు చెందిన టీడీపీ కార్యకర్తలు రాజప్ప, ఝాన్సీలు శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, పంచాయతీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసులు, టీవీ రవి, నేతలు రామలింగారెడ్డి, వెంకటరమణ, నవీన్, మంజునాథ్, బ్రహ్మానందంలు శనివారం వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబాలకు పార్టీ తరపున రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన రామకుప్పం నాయకులు



సీఎం చంద్రబాబుతో ఎంపీపీ సులోచన, వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడు

రామకుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రప్రదేశ్): రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా ఎన్నికైన సులోచన, వెంకట్రామగౌడు, టీడీపీ నాయకుడు గుర్రప్ప అమరావతి సచివాలయంలో శనివారం సీఎం చంద్రబాబును కలిశారు. తమకు ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా అవకాశం కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రజలకు మెరుగైన సేవలందించి మన్ననలు పొందేలా పనిచేయాలని సీఎం సూచించారని పేర్కొన్నారు.

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



రాళ్లబూదుగూరు సచివాలయానికి ఇ-ఆటోను అందిస్తున్న ఎంపీడీవో కుమార్

శాంతిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లబూదుగూరు పంచాయతీలో చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని స్వచ్ఛాంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసిందని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రభుత్వం అందించిన ఇ -ఆటోను సర్పంచ్ లక్ష్మీ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి అందించారు. పంచాయతీ కార్మికులు ఆటోకు పూజలు చేసి గ్రామాల్లో చెత్త సేకరణకు సిద్ధమయ్యారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ రోజూ ఇళ్లవద్దకే వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి బృందావనాలకు తరలించాలన్నారు. ఈవోపీఆర్డీ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి స్వాతి, యూనిట్ ఇన్‌చార్జి ఆర్‌ఎస్ మణి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బసవరాజు, నేతలు వాజిద్, గోపి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



సన్మానం అందుకుంటున్న చందనప్రియ

సోమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పశువైద్యంలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా అవార్డులు స్వీకరించడం అభినందనీయమని సోమల ఏడీహెచ్ శ్రీనివాసులునాయుడు అన్నారు. శనివారం ప్రపంచ పశువైద్యుల దినోత్సవం సందర్భంగా పెద్దఉప్పరపల్లె పశువైద్యాధికారి చందనప్రియను చిత్తూరులో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, సంయుక్త సంచాలకులు డాక్టర్ ఆరిఫ్ అవార్డు అందజేసి సన్మానించారు.

నంజంపేటలో పోలీసుల పల్లెనిద్ర

సోమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంజంపేటలో ఎస్‌ఐ శివశంకర ఆధ్వర్యంలో సోమల పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు ప్రజలకు మధ్య స్నేహభావం ఉండాలని, గ్రామాలకు కొత్త వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం అక్రమ మద్యం అమ్మకాలపై ఫిర్యాదులు చేయాలన్నారు. చిన్నపాటి వివాదాలకు స్టేషన్ వరకు రాకుండా పరిష్కరించుకోవాలని సూచించారు.

సాంఘిక బహిష్కరణపై పవన్‌కల్యాణ్ స్పందించాలి

పలమనేరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం మల్లం గ్రామంలో దళిత కుటుంబం సాంఘిక బహిష్కరణకు గురైన విషయంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెంటనే స్పందించి దోషులపై తక్షణ చర్యలు తీసుకోవాలని పలమనేరులోని మానవహక్కుల సంఘం, అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షులు డీవీ మునిరత్నం డిమాండు చేశారు. మల్లం గ్రామంలో విద్యుత్ పనులకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో చనిపోతే అతని కుటుంబానికి న్యాయం చేయకుండా అగ్రవర్ణాల వారు ఆ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

భానుడి ప్రతాపం

● సదుంలోని రోడ్లన్నీ నిర్మానుష్యం



సదుం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు జనం అల్లాడుతున్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఎండ తీవ్రత హడలెత్తించింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు సైతం సదుంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. రోజంతా ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. సాయంత్రం 6 గంటల వరకూ 39 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గలేదు. దీంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

రేపటి గ్రీవెన్స్ డే రద్దు

కుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘ చైర్‌పర్సన్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఈనెల 28వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని, నియోజకవర్గ ప్రజలు ఈ విషయం గమనించాలని ఆయన కోరారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

కుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి జూన్ 6 వరకు చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం పట్టణం టీబీ రోడ్డులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (ఉర్దూ)లో రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. రామ నామ లేఖనం, పజిల్స్ గేమ్స్, సుడోకు, పేపర్ క్రాఫ్ట్, చెస్, క్యారంబోర్డుతో పాటు కొన్ని సంప్రదాయక ఆటలు, భారతంలోని ప్రసిద్ధ ప్రదేశాలు, వివిధ క్షేత్రాల్లో ప్రసిద్ధి గాంచిన వ్యక్తుల గురించి క్లుప్తంగా తెలుసుకోవడం, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం, ప్రాతఃస్మరణీయం, కథలను వినడం, చెప్పడం, రాయడం, యోగ, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, భగవద్గీత 5వ అధ్యాయం కర్మ సన్యాస యోగం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. శిబిరంలో 8 సంవత్సరాల వయసు పైబడిన పిల్లలు రావచ్చన్నారు. పిల్లల పేర్ల నమోదుకు 28వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్‌నంబరు 9676124756 ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికలు ఏకగ్రీవం



లక్కనపల్లె ఎన్నికల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలప్పల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి ఆధ్వర్యంలో జరిగిన టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో పంచాయతీ అధ్యక్షుడిగా జయరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తమ్మన్న ఎన్నికయ్యారు. అలాగే లక్కనపల్లె పంచాయతీ అధ్యక్షుడిగా మంజునాథ్, ప్రధాన కార్యదర్శిగా ఉమాశంకర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని టీడీపీ నాయకులు అభినందించారు.

భవన నిర్మాణ అనుమతుల లైసెన్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో ప్రజలకు సులభతరంగా స్వీయ ధ్రువీకరణ అంగీకార పత్రం సమర్పించి, భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయడానికి లైసెన్సు కోసం ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఐటీఐ, డిప్లమో, బీటెక్ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వైసీపీ హయాంలోనే మద్యం కంభకోణం

శాంతిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు ఆరోపించారు. శనివారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ 2019 తర్వాత జగన్ పరిపాలనలో నూతన మద్యం పాలసీ పేరుతో భారీగా ఆర్థిక అవకతవకలు జరిగాయని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడిందన్నారు. 2019 ఎన్నికల్లో మద్యపాన నిషేధం చేస్తామని ఇచ్చిన హామీకి జగన్ తూట్లు పొడిచారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చి అంచలంచెలుగా మద్యం దుకాణాలను తగ్గిస్తూ వస్తామని చెప్పి జగనే మళ్లీ కరోనా తర్వాత దుకాణాలను పెంచారన్నారు. ఇప్పటికీ పాత బ్రాండ్లకు రూ.127 కోట్లకు పైగా బకాయిలు పెట్టారని తెలిపారు. మద్యం, బీర్ల తయారీదారులను బెదిరించి రూ.3,113 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. మద్యం అవకతవకలను వెలికితీయడానికి సీఐడీ విచారణ చేపడుతోందని తెలిపారు.

వనరులు సరే.. అభివృద్ధే శూన్యం..!

● గాడితప్పిన రాజనాలబండ ఆలయ పాలన ● టీటీడీ ఆధీనంలో ఉన్నా అంతంతమాత్రం
● ఆదాయం వైపు దృష్టి సారించని అధికారులు



రాజనాలబండ ఆంజనేయస్వామి ఆలయం



చౌడేపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండకు చెందిన ఆదాయ వనరులకు వేలం నిర్వహించకుండా ఆలయ నిర్వాహకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రాజనాలబండను రెండేళ్ల క్రితం టీటీడీ ఆధీనం చేసుకుని ఆలయ నిర్వహణ చేపడుతోంది. గత ఏడాది వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని టీటీడీ అధికారులు ఘనంగా నిర్వహించారు. మొదట్లో టీటీడీ అధికారులు ఆలయ అభివృద్ధి, పాలనపై దృష్టి సారించారు. అయితే గత కొంత కాలంగా ఆలయ పాలన సైతం గాడి తప్పి అస్తవ్యస్తంగా ఉందని భక్తులు ఆరోపిస్తున్నారు. ఏటా ఆలయానికి చెందిన మామిడి తోటలు, చింత చెట్లు, వ్యవసాయ భూములు వేలం వేయడంతో సుమారు రూ.2 నుంచి 3 లక్షల వరకు ఆలయానికి ఆదాయం చేకూరుతుండేది. అయితే మామిడి తోట కాయలు కాపు దశలో ఉన్నా.. ఇంతవరకు వేలం నిర్వహించలేదు. వేలం నిర్వహిస్తే దక్కించుకున్న వారు తోటలకు కాపలా ఉండటం, మందుల పిచికారీ తదితర పనులు చేసుకుంటే అధికంగా దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి. అప్పుడే ఆలయానికి సైతం మంచి ఆదాయం సమకూరుతుంది. అలాగే చింత చెట్లు కూడా స్వామివారికి మాన్యంగా ఉన్నాయి. చింత చెట్ల వేలం కూడా వేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే వ్యవసాయ భూములకు వేలం నిర్వహించకపోవడం గమనార్హం. గత కొంత కాలంగా ఆలయ పాలన గాడి తప్పిందని, అభిషేకాలు, సత్యప్రమాణాలు తదితర ఆదాయ వనరుల రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయానికి చెందిన భూములు స్వాధీనం చేసుకుని స్వామి వారి పేరుతో పట్టా పాసు పుస్తకాలు చేయించాలని భక్తులు కోరుతున్నారు. ఆలయానికి గత కొంత కాలంగా టీటీడీ అధికారులు సైతం సక్రమంగా రావడం లేదని, ఆలయ పాలన అస్తవ్యస్తంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ ఆదాయం స్వాహా చేయాలని కొందరు స్థానికులు టీటీడీ ఆధీనం లో వద్దని, దేవదాయ శాఖ ఆధీనం చేయాలని ప్రయత్నాలు చేశారు. టీటీడీ అధికారులు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నా ఆలయ పాలన, అభివృద్ధిపై దృష్టి సారించలేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

బహుదూర్ అలీషా ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



ఉరుసు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దాదేపల్లెలోని హజ్రత్ సయ్యద్ ఫిర్ మషాయఖ్ బహుదూర్ అలీషా ఉరుసు పోస్టర్లను తెల్లనీళ్లపల్లెలో శనివారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షులు మహ్మద్ గని, అమీద్‌ఖాన్, సైద్‌ఖాన్, ఇసూబ్ సాబ్, సైయ్యాద్‌బాషా, పారుక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నూర్‌షావలీ బాబా ఉరుసు



అలంకరణలో నూర్‌షావలీబాబా దర్గా



ఉరుసుకు వచ్చిన జనం

పుంగనూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎన్‌ఎస్‌పేట వద్ద వెలసిన హజరత్ సయ్యద్ నూర్‌షావలీ బాబా ఉరుసు ఉత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. దర్గా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. శనివారం రాత్రి ఢిల్లీ, మైసూరులకు చెందిన వారిచే పోటాపోటీగా కవ్వాలీ పాట కచేరి జరిగింది. అధిక సంఖ్యలో హిందువులు, ముస్లిం సోదరులు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బోయకొండ ఆలయాన్ని ‘ప్రసాద్ పథకం’లో చేర్చాలి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అయూబ్‌ఖాన్

పుంగనూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయ కొండ గంగమ్మ ఆలయాన్ని ప్రసాద్ పథకం కింద పరిగణించి అభివృద్ధి చేయాలని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్ విన్నవించారు. శనివారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి బోయకొండ గంగమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ప్రసాద్ పథకం కింద పరిగణించి పర్యాటక, ఆధ్యాత్మిక రంగాల్లో అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు అయూబ్ ఖాన్ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన ఆవు

● రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



ఆవును బయటకు తీసిన అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రాంపల్లె కోల్డ్ స్టోరేజ్ లోపల బావిలో ప్రమాదవశాత్తు పడిన ఆవును శనివారం పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలతో బయటకు లాగి కాపాడారు. కోల్డ్ స్టోరేజ్ లోపల ఉన్న బావిలో ఆవు మేస్తూ కాలుజారి పడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తన సిబ్బందితో వెంటనే చేరుకుని ఆవును బయటకు తీసి యజమాని శేఖర్‌రాజుకు అప్పగించారు.

పంచాయతీల్లో సేంద్రియ ఎరువులు తయారు చేయాలి

సోమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో రాబడి పెంచాలని.. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని ఎంపీడీవో నారాయణ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన మాట్లాడుతూ వర్మీకంపోస్టు తయారీ చేసి రైతులకు అమ్మకాలు చేయాలని, సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని గుర్తించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మార్కెట్‌యార్డు సమీపంలో శనివారం జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.29,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పట్టణానికి చెందిన మంజునాథ్, వీరన్న, కుమార్, అహ్మద్, సురేంద్రలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో జరిగిన గొడవలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు శనివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన మహేష్ కుమారుడు నవనీత్ (26) పురుగుల మందుతాగడంతో స్నేహితులు గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు.

30న పశువుల పరుష బహిరంగ వేలం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న పుంగనూరు మాణిక్య వరదరాజస్వామి రథోత్సవపు పశువుల పరుష రుసుం వసూళ్లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏకాంబరం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో జరిగే వేలంలో రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

మామిడి రైతులకు 20 లక్షల కవర్లు

పలమనేరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాల్లోని మామిడి రైతులకు నాణ్యమైన దిగుబడి కోసం 20 లక్షల కవర్లు సబ్సిడీపై పంపిణీ చేసినట్లు ఉద్యానశాఖ అధికారిణి లక్ష్మీప్రసూన తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈసారి మామిడి రైతుల్లో చైతన్యం వచ్చి తాము ఇచ్చిన కవర్లు సరిపోక కొందరు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకొని కాయలకు కట్టుకున్నారన్నారు. పలమనేరు మండలంలో 2,800 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా.. 5 లక్షల కవర్లు, బైరెడ్డిపల్లి మండలంలో 1600 ఎకరాల్లో మామిడి తోటలుండగా 6.5 లక్షల కవర్లు, వి.కోట మండలంలో 4800 ఎకరాల్లో మామిడి తోటలుండగా 17.5 లక్షల కవర్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈసారి మామిడి తోటల్లో కవర్లు కట్టడంతో నాణ్యమైన మామిడి దిగుబడి వస్తుందన్నారు. మామిడి కాయలకు ఏవిధంగా కవర్లు కట్టాలో క్షేత్రస్థాయిలో మామిడి రైతులకు అవగాహన కల్పించినట్లు వివరించారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు



విశేష అలంకరణలో శనీశ్వరస్వామి

రామకుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్య క్షేత్రం ఆవరణలోని శనీశ్వరాలయంలో శనివారం శని త్రయోదశి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి తైల, పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. శనీశ్వరాలయంతోపాటు వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలూ భక్తులతో కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

● బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినేపల్లె సమీపంలో కొలువైన శనీశ్వరాలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి విశేషాలంకరణ, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



29న యల్లమ్మ ఆలయంలో మండల పూజ

కల్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రానికి సమీపంలోని వగళ్లవారిపల్లి బస్టాపు వద్ద నూతనంగా నిర్మించిన యల్లమ్మ తల్లి ఆలయంలో ఈనెల 29న మండల పూజ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. మహాభిషేకం, ప్రత్యేకాలంకరణ, దివ్యదర్శనం, అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయని..భక్తులు పాల్గొనాలని కోరారు.

నందివాహనంలో విహరించిన శివపార్వతులు



సోమల శివాలయంలో కలశ పూజలు



సోమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పురవీధుల్లో శివపార్వతులను నందివాహనపై ఊరేగించారు. శనివారం ఉదయం ఆలయ శుద్ధి, మూలవిరాట్‌కు విశేష అలంకరణలు చేసి ఆలయంలో పూజలు నిర్వహించారు. రాత్రి శెట్టివారి వీధి ఉభయదారులచే చెక్క భజనలు, కోలాటాల నడుమ ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సోమశేఖర్ పర్యవేక్షించారు.

లోఓల్టేజీ నివారణకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ఆవులపల్లె వద్ద ట్రాన్స్‌ఫార్మను ప్రారంభించిన ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తదితరులు

సోమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లోఓల్టేజీ నివారణకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆవులపల్లె సబ్‌స్టేషన్ నుంచి పేటూరు సబ్‌స్టేషన్‌కు 33కేవీ విద్యుత్ సరఫరాలైన్ ఆయన ప్రారంభించారు. గతంలో పేటూరు సబ్‌స్టేషన్‌కు పెనుగొలకల సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగేది. దీంతో పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లోని గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యలు ఉండేవి. ప్రతి గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో లోఓల్టేజీ సమస్యలకు పరిష్కారం జరిగిందన్నారు. అన్ని గ్రామాల్లోనూ 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతుందని చెప్పారు. గృహవినియోగదారులు ఒక కిలోవాట్‌కి రూ.2400 కట్టి అడిషనల్‌గా గతంలో పొందేవారని, ప్రస్తుతం ఒక కిలోవాట్‌కు రూ1,250 చెల్లిస్తే అడిషనల్ సరఫరా తీసుకోవచ్చన్నారు. ఫ్రిజ్, వాషింగ్ మిషన్ తదితర వినియోగదారులు ఈ అవకాశాన్ని పొందాలన్నారు. అనంతరం సోమల, ఆవులపల్లె, నంజంపేట సబ్‌స్టేషన్లు ఆయన తనిఖీ చేసి విద్యుత్ సరఫరా వేళలు పరిశీలించారు. సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది, రైతులతో విద్యుత్ వినియోగంపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈలు నరేంద్ర, రెడ్డికుమార్, ఏఈ మహేంద్రరెడ్డి, ఎల్‌ఐ చిన్నప్పరెడ్డి, లక్ష్మీపతిరాజు, నవీన్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయ భద్రత అందరి బాధ్యత



ఆలయ సెక్యూరిటీ, హోంగార్డులకు సూచనలిస్తున్న పెంచలకిషోర్

కాణిపాకం(ఐరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ భద్రత మనందరి బాధ్యత అని ఈవో పెంచలకిషోర్ అన్నారు. ఇటీవల పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో శనివారం ఆలయ సెక్యూరిటీ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆలయానికి విచ్చేసే భక్తులను చెకింగ్ పాయింట్ వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎలాంటి బ్యాగులను అనుమతించ వద్దని చెప్పారు. ఆలయ పరిసరాల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అదేసమయంలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, హోంగార్డు హెడ్ వినాయకం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

● ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ పిలుపు



కార్వేటినగరంలో 'ఖాజీ' కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న థామస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ పిలుపునిచ్చారు. శనివారం కార్వేటినగరంలో ఖాజీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఖాజీగా నియమితులైన షేక్ జాఫర్ ఆలీని సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, మైనార్టీ నాయకులు సంధాని, దస్తగిరి, నియాజ్, జిలానీబాషా, టీడీపీ నాయకులు బీగాల రమేష్, మాదిరాజు జనార్దనరాజు, అక్కల తిరుమలనాథ్, మేళం రవియాదవ్, తోటి రవికుమార్, తోటి మురళీమోహన్, ఢిల్లీబాబురెడ్డి, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యలు పరిష్కరిస్తాం: పాస్టర్ల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని థామస్ హామీ ఇచ్చారు. శనివారం కార్వేటినగరం మండలం అల్లాగుంట వద్ద పాస్టర్లు, క్రైస్తవులు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ నాయకులు యోనా, రాజా తదితరులు పాల్గొన్నారు.

నగరిలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్



మ్యాన్‌హోల్‌లో ఇరుక్కున్న కారును బయటకు తీస్తున్న స్థానికులు

నగరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారాయి. చావడి ప్రాంతంలో మూతపెట్టకుండా వదిలేసిన మ్యాన్‌హోల్‌లో శనివారం ఉదయం ఒక కారు టైరు ఇరుక్కుపోయింది. ఏ ప్రమాదం జరగక పోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం కారును బయటకు తీశారు. ఇకనైనా ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి: కమిషనర్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పనిసరిగా చేయాలని కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్, వ్యర్థాల నియంత్రణ అంశాలపై శనివారం ప్రజారోగ్య అధికారులతో సమీక్షించారు. వీధుల్లోకి చెత్త తరలించే వాహనాలు వచ్చే నిర్దేశిత సమయాన్ని సూచిస్తూ బోర్డుల్లో.. మేస్త్రి, కార్యదర్శి ఫోన్ నెంబర్లను రాయించాలన్నారు. ఎంహెచ్‌వో లోకేష్ పాల్గొన్నారు.

పశుగ్రాసం కోసం పాడి రైతుల తిప్పలు



ట్రాక్టర్లో తరలిపోతున్న వరి గడ్డి మోపులు

విజయపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం కోసం మండలంలోని పాడి రైతులకు తిప్పలు తప్పడం లేదు. పన్నూరు, ఇళ్లత్తూరు, జీఎంపురం, కాళికాపురం, కళియంబాకం, మాధవరం ప్రాంతాల్లో వరి గడ్డి ఎక్కువగా లభిస్తుంది. ఇక్కడి నుంచి బయటి ప్రాంతాలవారు వరిగడ్డి ఒక్కో మోపును రూ.130-180 వరకు చెల్లించి కొనుగోలు చేసి, తీసుకెళుతున్నారు. దీనివల్ల పశుగ్రాసం కొరత ఏర్పడుతోందని మండలంలోని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటినుంచి ఆముదాలలో మహాభారత ఉత్సవాలు

పాలసముద్రం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆముదాలలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం నుంచి మే ఏడో తేదీవరకు మహాభారత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త ఎం.సురేష్ శనివారం తెలిపారు. ఆలయం ప్రాంగణంలో రోజూ మధ్యాహ్నం భాగవతారిణి మాలతీకృష్ణ ఆధ్వర్యంలో మహాభారతం హరికథ, రాత్రి వీరభద్రయ్య ఆధ్వర్యంలో వీధి నాటకాలు ఉంటాయన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



బంగారుపాళ్యం పోలీసు స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడానికి తగ్గువారిపల్లె పంచాయతీలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏడీ కొండయ్య, ఏఈ దేవిప్రసన్న శనివారం తెలిపారు. ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, డీఈ మునిచంద్ర ఆదేశాలతో మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ సమీపంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

చిత్తూరురూరల్: చిత్తూరు గిరింపేట సెక్షన్ పరిధిలోని జంగాలపల్లె కాలనీలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను డీఈ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. లోఓల్టేజీ సమస్యను పరిష్కరించిన విద్యుత్ సిబ్బందిని 20వ వార్డు కార్పొరేటర్ అశోక్, స్థానికులు సన్మానించారు.

వరసిద్ధుడి ఆలయ భద్రత మనందరి బాధ్యత: ఈవో



ఆలయ సెక్యూరిటీ, హోంగార్డులకు సూచనలిస్తున్న పెంచలకిషోర్

కాణిపాకం(ఐరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ భద్రత మనందరి బాధ్యత అని ఈవో పెంచలకిషోర్ అన్నారు. ఇటీవల పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో శనివారం ఆలయ సెక్యూరిటీ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆలయానికి విచ్చేసే భక్తులను చెకింగ్ పాయింట్ వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎలాంటి బ్యాగులను అనుమతించ వద్దని చెప్పారు. ఆలయ పరిసరాల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అదేసమయంలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, హోంగార్డు హెడ్ వినాయకం తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో పతకం సాధించాలి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో మన రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న అండర్-19 క్రీడాకారులు పతకం సాధించాలని జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రాజేంద్ర శనివారం పిలుపునిచ్చారు. జడ్పీ హైస్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో శిక్షణ ముగింపు కార్యక్రమానికి డీఎస్‌డీవో బాలాజి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో ఈనెల 30 నుంచి మే ఐదో తేదీ వరకు జాతీయ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు బంగారుపాళ్యంకు చెందిన మాజీ క్రీడాకారుడు దావూద్ ఖాన్ రూ.పదివేల విలువైన బూట్లను అందజేశారు. పీడీలు మధు, దేవేంద్ర, ముత్తు, కోచ్ రాజేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో డీఎస్‌డీవో బాలాజి, హెచ్ఎం రాజేంద్ర తదితరులు

తాగునీటి సమస్య లేకుండా చూడండి

పాలసముద్రం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి ఆదేశించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. తాగునీటి సమస్య తలెత్తే గ్రామాలుంటే ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్, ఈవోపీఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడుకు తరలిపోతున్న ఇసుక

● అక్రమార్కులపై నిఘా పెట్టాలంటున్న స్థానికులు

విజయపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అధికారులు ఎన్ని కట్టుదిట్టాలు చేసినా ఇసుకను కొందరు తమిళనాడుకు అక్రమంగా తరలించుకెళుతున్నారు. పైగా ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడుస్తున్నారు. విజయపురం మండలంలోని పలు గ్రామాలకు తమిళనాడు సరిహద్దులు ఉండటంతో అక్రమార్కులు రంగప్రవేశం చేశారు. ప్రధానంగా మండలంలోని కేవీ శ్రీరామాపురం వద్ద ఉన్న కుశస్థలి నది నుంచి ఇసుకను తీసుకుని ఆంధ్రా సరిహద్దుల్లో డంప్ చేస్తున్నారు. రాత్రయ్యాక తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కోసారి గ్రావెల్ బిల్లుతో కూడా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, దీనిపై అధికారులు నిఘా పెట్టాలని కోరుతున్నారు.



కేవీ శ్రీరామాపురం సమీపంలోని చిత్తూరు - తచ్చూరు రోడ్డు పక్కన ఇసుక డంప్

మూగజీవాల పాలిట ప్రాణదాతలుగా పశువైద్యులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల పాలిట ప్రాణదాతలుగా పశువైద్యులు కీలకపాత్ర పోషిస్తారని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. శనివారం పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో ప్రపంచ పశువైద్య దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పశుపోషణపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉంటాయని చెప్పారు. పశువులకు వైద్యం చేయడం ద్వారా పరోక్షంగా ఆ కుటుంబాల్లోనూ జీవన ప్రమాణాలు పెంచడంలో పశువైద్యుల సేవలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం విశ్రాంత పశువైద్యులను సన్మానించారు. పశుసంవర్ధక శాఖ జేడీ మహమ్మద్ అబ్దుల్ అరీఫ్, పశువైద్యాధికారులు, పాడి రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు →

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పెనుమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కావూరివారిపల్లె వద్ద ఉన్న పార్వతీపరమేశ్వర రుణమోజనేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాసశివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సప్తగిరి బ్యాంకు మేనేజరు నాగరాజు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త కృపానందపిళ్లై, నిర్వాహకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి వేసవి శిక్షణ కార్యక్రమాలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మే ఆరో తేదీవరకు చిన్నారులకు వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6-12 ఏళ్లలోపు బాలబాలికలకు రోజూ ఉదయం 8.30 నుంచి 11గంటల వరకు వేదం, ధ్యానం, యోగ, ఆటలు, పాటల్లో శిక్షణ.. కథలు, కాల సద్వినియోగం, ఆహారపు అలవాట్లు, పురాణగాథలు, ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత, కుటుంబ విలువలు తదితర అంశాలను బోధించనున్నట్లు వివరించారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్, కొంగారెడ్డిపల్లె ఉషానగర్ భజన మండలి, సంతపేట పిళ్లయార్ గుడి వీధుల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు తెలిపారు.

'మన ఊరికి.. మన థామస్'



టీడీపీలో చేరిన కాంగ్రెస్ నేత వివేకానందరెడ్డిని సత్కరిస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్.లక్ష్మీరెడ్డిపల్లె దళితవాడలో 'మన ఊరికి.. మన థామస్' కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి ప్రభుత్వ విప్ థామస్ అర్జీలను స్వీకరించారు. నెల్లేపల్లె పంచాయతీలో 8 నెలల కాలంలోనే తనతోపాటు ఎంపీ నిధులు రూ.1.50కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ సందర్భంగా థామస్ సమక్షంలో ఎన్.లక్ష్మీరెడ్డిపల్లెకు చెందిన కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నేత, మూడు సార్లు సర్పంచ్‌గా పనిచేసిన వివేకానందరెడ్డి (బాబురెడ్డి) టీడీపీలో చేరారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమన్నారు. నాయకులు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఒక్కటే జీవితం' గ్రంథావిష్కరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విజయం విద్యాసంస్థలో బౌద్ధ దమ్మ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ అనువాద రచయిత బి.రామస్వామి రఘుపతి అనువదించిన 'ఒక్కటే జీవితం' గ్రంథావిష్కరణ శనివారం జరిగింది. పుస్తక సమీక్షను ఆంగ్ల సాహితీ రచయిత్రి టి.అనురాధ చేశారు. స్టేట్ ఫైర్ సర్వీసెస్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ డి.మురళీమోహన్, కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ వ్యవస్థాపకురాలు రామలక్ష్మి, జిల్లా రచయితల సంఘం నాయకులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, గిరిధరన్, హరినాయుడు, గంటామోహన్, తేజోమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నూర్‌షావలీ బాబా ఉరుసు



ఉరుసుకు వచ్చిన జనం

పుంగనూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎన్ఎస్‌పేట వద్ద వెలసిన హజరత్ సయ్యద్ నూర్‌షావలీ బాబా ఉరుసు ఉత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. దర్గా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. శనివారం రాత్రి ఢిల్లీ, మైసూరులకు చెందిన వారిచే పోటాపోటీగా కవ్వాలీ పాట కచేరి జరిగింది. అధిక సంఖ్యలో హిందువులు, ముస్లిం సోదరులు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నంజంపేటలో పోలీసుల పల్లెనిద్ర


సోమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంజంపేటలో ఎస్ఐ శివశంకర ఆధ్వర్యంలో సోమల పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు ప్రజలకు మధ్య స్నేహభావం ఉండాలన్నారు. చిన్నపాటి వివాదాలకు స్టేషన్ వరకు రాకుండా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఒకరికి కత్తిపోట్లు



చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గిరింపేట జంక్షన్ వద్ద ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. రెండో పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. శంకరయ్యగుంటకు చెందిన మణితేజ, చంద్రలకు చామంతిపురానికి చెందిన రాజేష్‌తో పాత కక్షలున్నాయి. నెల కిందట కూడా ఘర్షణ పడి కేసులు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం గిరింపేట జంక్షన్ వద్ద మణితేజ, చంద్రలు కలిసి రాజేష్‌ను కత్తితో పొడిచి పరారయ్యారు. రాజేష్ మెడపై, ఛాతీపై, ముఖంపై గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలోని నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



వెదురుకుప్పం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మారేపల్లె గ్రామ సమీపంలోని మద్దేమాను ప్రాజెక్టు దగ్గర చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకున్నట్లు పశువుల కాపరులు గుర్తించారు. ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. వ్యక్తిగత వివరాలు తెలియలేదని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం స్వాధీనం: విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం స్వాధీనం చేసుకుని, విక్రేతను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ శనివారం తెలిపారు. సామిచేనుమిట్టకు చెందిన వరదరాజులు మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో దాడులు చేశారు. వరదరాజులను అదుపులోకి తీసుకుని, అతడి వద్దనుంచి 271 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



పెనుమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గుడ్యాణంపల్లెకు చెందిన కృష్ణారెడ్డి పొలంలో ఉన్న 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. అందులోని రాగిని అపహరించుకెళ్లారు. శనివారం ఉదయం రైతు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశాక నూతన ట్రాన్స్‌ఫార్మర్‌కు సిఫారసు చేస్తామని ఏఈ తులసిప్రసాద్ తెలిపారని రైతు పేర్కొన్నాడు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

తవణంపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తవణంపల్లె పోలీసులు తెలిపారు. గోవిందరెడ్డిపల్లెకు చెందిన సురేష్ 14 ఏళ్ల కుమార్తె ఈనెల 24వ తేదీన ఇంట్లో తన తల్లితోపాటు నిద్రపోయింది. అర్ధరాత్రి దాటాక రెండు గంటలకు చూడగా ఇంట్లో కనపడలేదు. పరిసర గ్రామాల్లో, బంధువులు ఉన్నచోట్ల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో తల్లి హేమలత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మార్కెట్ యార్డు సమీపంలో శనివారం జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.29,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పట్టణానికి చెందిన మంజునాథ్, వీరన్న, కుమార్, అహ్మద్, సురేంద్రలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో జరిగిన గొడవలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు శనివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన మహేష్ కుమారుడు నవనీత్ (26) పురుగుల మందుతాగడంతో స్నేహితులు గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు.

వైసీపీ హయాంలోనే మద్యం కుంభకోణం

శాంతిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు ఆరోపించారు. శనివారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ 2019 తర్వాత జగన్ పరిపాలనలో నూతన మద్యం పాలసీ పేరుతో భారీగా ఆర్థిక అవకతవకలు జరిగాయని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో మద్యపాన నిషేధం చేస్తామని ఇచ్చిన హామీకి జగన్ తూట్లు పొడిచారన్నారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చి మద్యం దుకాణాలను తగ్గిస్తూ వస్తామని చెప్పి మళ్లీ కరోనా తర్వాత దుకాణాలను పెంచారన్నారు. ఇప్పటికీ పాత బ్రాండ్లకు రూ.127 కోట్లకు పైగా బకాయిలు పెట్టారని తెలిపారు. మద్యం, బీర్లుతయారీదారులను బెదిరించి రూ.3,113 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. మద్యం అవకతవకలను వెలికితీయడానికి సీఐడీ విచారణ చేపడుతోందని తెలిపారు.

కిశోర బాలికల భద్రతే ధ్యేయం

ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వరి

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల భద్రతే ధ్యేయంగా ముందుకెళ్లాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి సూచించారు. శనివారం డీఆర్‌డీఏ మీటింగ్ హాలులో కిశోర వికాసం.. సమ్మర్ స్పెషల్ కార్యాచరణపై మండల స్థాయిలో వివిధ శాఖల నోడల్ అధికారులతో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టాలని చెప్పారు. రిసోర్స్‌పర్సన్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కిశోర వికాసం కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి డాక్టర్ దాసరి సుబ్రహ్మణ్యం, ఐరాల ఎంపీడీవో ధనలక్ష్మి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఇంద్రాణి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఉపాధి పనుల తనిఖీ

గుడిపాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వసంతాపురం పంచాయతీ పశుమందలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఎంపీడీవో కుమార్ తనిఖీ చేశారు. కూలీలకు గ్లూకోజ్ ప్యాకెట్లను అందజేశారు. టెక్నికల్ అసిస్టెంట్ సుందరయ్య పాల్గొన్నారు.

30న మహాభారత యజ్ఞం

గుడిపాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వసంతాపురం గ్రామ సమీపంలో ఈనెల 30వ తేదీన మహాభారత యజ్ఞాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే థామస్ శనివారం ప్రారంభించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళలకు ఈ కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు ఇందిరమ్మ, రాజశేఖర్ నాయుడు, గుండయ్య, సూరిరెడ్డి, వేమనాయుడు, పైనేని మురళి, సిద్ధయ్యశెట్టి, సురేష్, జనసేన నాయకులు చిరంజీవి, పవన్, చందు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మండల పూజ



నింద్ర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నింద్రలోని ప్రసన్న వినాయకస్వామి ఆలయంలో శనివారం మండల పూజను వైభవంగా నిర్వహించారు. మహాకుంభాభిషేకం తర్వాత మూడో రోజున ఈ పూజ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వైసీపీ ప్రచార విభాగం కార్యదర్శిగా శేఖర్‌రాజు

విజయపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కోసనగరానికి చెందిన శేఖర్‌రాజు నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి పదవి రావడానికి కృషి చేసిన మాజీ మంత్రి రోజా, వైసీపీ నాయకులు కుమాస్వామిరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన ఆవు

● రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



ఆవును బయటకు తీసిన అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రాంపల్లె కోల్డ్ స్టోరేజ్ లోపల బావిలో ప్రమాదవశాత్తు పడిన ఆవును శనివారం పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలతో బయటకు లాగి కాపాడారు. కోల్డ్ స్టోరేజ్ లోపల ఉన్న బావిలో ఆవు మేస్తూ కాలుజారి పడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తన సిబ్బందితో వెంటనే చేరుకుని ఆవును బయటకు తీసి యజమాని శేఖర్‌రాజుకు అప్పగించారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



ఉరుసు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దాదేపల్లెలోని హజ్రత్ సయ్యద్ ఫిర్ మషాయఖ్ బహద్దూర్ అలీషా ఉరుసు పోస్టర్లను తెల్లనీళ్లపల్లెలో శనివారం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షులు మహ్మద్‌గని, అమీద్‌ఖాన్, సైద్‌ఖాన్, ఇసూబ్‌సాబ్, సైయ్యాద్‌బాషా, పారుక్ తదితరులు పాల్గొన్నారు.